ఆశాలు.. ఆరోగ్య రక్షణ కవచాలు

- 20 ఏళ్లు దాటినా ఆశాలకు కనీస వేతనాలు కరువు
- స్థిర కనీస వేతనం రూ.26 వేలు వచ్చే వరకు పోరాటాలు
- తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర అధ్యక్షులు పి.జయలక్ష్మి
- మహబూబ్‌నగర్‌లో ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర మహాసభలు ప్రారంభం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

దేశమంతా కరోనా భయంతో ఇంట్లో నుంచి బయటకు రాకుండా గజగజ వణుకుతుంటే.. ప్రాణాలకు తెగించి ఫ్రంట్ వారియర్స్‌గా పనిచేసిన ఆశా వర్కర్లు.. ఆరోగ్య రక్షణ కవచాలని తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర అధ్యక్షులు పి.జయలక్ష్మి అన్నారు. రాత్రిపగలు తేడా లేకుండా ప్రతి రోజూ 12 గంటలకు పైగా పనిచేస్తున్న ఆశాలకు స్థిర కనీస వేతనం రూ.26 ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆదివారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని క్రౌన్ ఫంక్షన్‌హాల్‌లో తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర 4వ మహాసభలు ప్రారంభమైంది. ముందుగా మున్సిపల్ టౌన్‌హాల్ నుంచి గడియారం చౌరస్తా, అంబేద్కర్ చౌరస్తా, బస్టాండ్ మీదగా ఫంక్షన్‌హాల్ వరకు భారీ ప్రదర్శన నిర్వహించారు. సిఐటియు జెండాలు చేత బూని, వారి యూనిఫాంతో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం సిఐటియు జిల్లా అధ్యక్షులు దీప్లానాయక్ అధ్యక్షతన జరిగిన బహిరంగ సభలో ఆమె మాట్లాడారు. ప్రజల ప్రాణాలను కాపాడటంతో పాటు ప్రభుత్వ పనులను సైతం చేస్తున్న ఆశాలకు కనీస వేతన చట్టం ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. గర్భిణీని కాన్పు కోసం ఆస్పత్రికి తీసుకెళ్తే ఒకోసారి రెండు, మూడు రోజులు ఆస్పత్రిలో దోమలతో జాగారం చేయాల్సిన దుస్థితి ఉంటుందన్నారు. ఇంతటి సేవలు అందిస్తున్న ఆశాలకు కాన్పులు, గర్భిణీల గుర్తింపు వంటి టార్గెట్లు పెట్టి వేతనాల్లో కోతలు పెట్టేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవడం దారుణమన్నారు. పారితోషికాలు, టార్గెట్ల వ్యవస్థను రద్దు చేసి ఆశాలను కార్మికులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చి 10 ఏళ్లు దాటినా ఆరోగ్య రంగానికి బడ్జెట్ ఎందుకు పెంచడం లేదని ప్రశ్నించారు. కార్మికులు పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దు చేసిన కేంద్ర ప్రభుత్వం.. వాటి స్థానంలో నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకొచ్చి కార్మికుల హక్కులను హరిస్తోందని విమర్శించారు. రాష్ట్రంలో ఎన్నికలకు ముందు రేవంత్ రెడ్డి ఆశాలకు రూ.18 వేలు ఇస్తానని హామీ ఇచ్చి.. రెండేళ్లు కావస్తున్నా.. దాన్ని అమలు చేయలేదన్నారు. వట్టి మాటలతో గాకుండా ఆశాల సమస్యలను పరిష్కరించి వెంటనే కనీస వేతన చట్టాన్ని అమలుచేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నీలాదేవి మాట్లాడుతూ.. కేంద్రంతో పోట్లాడి అనేక ఉద్యమాలు చేసి వేతనాలు పెంచుకున్న విషయాన్ని గుర్తు చేశారు. ఇటీవల చేసిన పోరాటాల ఫలితంగా ఆశా వర్కర్లకు కేంద్రం రూ.1500 పెన్షన్ ఇచ్చిందని తెలిపారు. ఆశా వర్కర్లు చనిపోతే వారి కుటుంబం రోడ్డున పడకుండా రూ.50 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.



ప్రదర్శన నిర్వహిస్తున్న ఆశాలు, నాయకులు

భవిష్యత్తు పోరాటాలకు సిద్ధం కావాలి
సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు భూపాల్

ఆశాలు, అంగన్వాడీలతో పాటు దేశవ్యాప్తంగా ఉన్న స్కీం వర్కర్లు భవిష్యత్తు పోరాటాలకు సిద్ధం కావాలని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు భూపాల్ పిలుపునిచ్చారు. దేశ వ్యాప్తంగా సుమారు 90 లక్షల మంది స్కీం వర్కర్లు ఉన్నారని, వీరంతా కేంద్ర ప్రభుత్వ పరిధిలో పనిచేస్తున్నారని తెలిపారు. శాశ్వత ఉద్యోగాల స్థానంలో కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్, స్కీం వర్కర్ల పేరుతో కార్మికులను శ్రమదోపిడీకి గురి చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎఎన్‌ఎంలతో సమానంగా విధులు నిర్వహిస్తున్న ఆశాలను స్కీం వర్కర్లుగా గుర్తించి కనీస వేతనం అమలు చేయాలని, ఇఎస్ఐ, పిఎఫ్ అందజేయాలని డిమాండ్ చేశారు. మిగతా ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగానే సెలవులు, ఉద్యోగ విరమణ తర్వాత ఇచ్చే సౌకర్యాలన్నీ కల్పించాలని కోరారు. సిఐటియు రాష్ట్ర సహాయ కార్యదర్శి వెంకటేశ్ మాట్లాడుతూ.. కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి.. ఆశాల జీవితాలను రోడ్డున పడేలా వ్యవహరిస్తోందన్నారు. ప్రతి ఏటా ఆరోగ్య రంగానికి నిధులను తగ్గిస్తూ వస్తోందని విమర్శించారు. అందుకే పోరాట పటిమతో ఆశాలు తమ హక్కుల సాధన కోసం పునరంకితం కావాలని తెలిపారు. యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ కాసు మాధవి మాట్లాడుతూ.. స్వచ్ఛంద ఆరోగ్య కార్యకర్తలుగా తమను తీసుకొని వేతనం లేకుండా వెట్టిచాకిరి చేయించుకుంటున్నా రని విమర్శించారు. వేతనాన్ని రూ.26వేలు ఇవ్వడంతో పాటు ఉద్యోగ భద్రత కోసం పోరాటాలను మరింత ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సిఐటియు రాష్ట్ర నాయకులు కిల్లె గోపాల్, రైతు సంఘం రాష్ట్ర నాయకులు ఎ.రాములు, ఉమ్మడి జిల్లా సిఐటియు అధ్యక్ష కార్యదర్శులు, ప్రజా సంఘాల నాయకులు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కేరళ మోడల్ దేశానికే ఆదర్శం

- నేను నా పిల్లలు ప్రభుత్వ బడిలోనే చదువుకున్నాం
- కేరళ ఎంపి శివదాసన్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కేరళ వామపక్ష ప్రభుత్వం విద్య, వైద్య సంస్థలను ప్రభుత్వరంగంలోనే నిర్వహిస్తూ పేద ప్రజలకు అందుబాటులో ఉంచుతోందని, ఆ ప్రభుత్వంలో ప్రత్యమ్నాయ విధానాలు దేశానికే ఆదర్శమని కేరళ పార్లమెంట్ సభ్యులు శివదాసన్ తెలిపారు. ఆదివారం హైదరాబాద్‌లోని బాగ్‌లింగంపల్లి సుందరయ్య పార్క్ వాకర్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సెంట్రల్ ఆధ్వర్యంలో వాకర్స్‌తో ఆ క్లబ్ ప్రెసిడెంట్ పివి నిరంజన్‌రెడ్డి అధ్యక్షతన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శివదాసన్ మాట్లాడుతూ.. తాను ప్రాథమిక విద్య నుండి పిహెచ్‌డి వరకు నయా పైసా ఖర్చు లేకుండా ప్రభుత్వ పాఠశాలలోనే చదివానని తెలిపారు. ప్రస్తుతం తన పిల్లలు సైతం ప్రభుత్వ పాఠశాలలోనే చదువుతున్నారని చెప్పారు. ఇది కేరళ వామపక్ష ప్రభుత్వ ప్రత్యామ్నాయ విధానానికి నిదర్శనమని వివరించారు. అక్షరాస్యతలో నూటికి నూరు శాతం ప్రగతి సాధించిన కేరళ దేశానికి ఆదర్శంగా నిలిచిందని చెప్పారు. అక్కడ ప్రతి గ్రామంలో ప్రభుత్వ పాఠశాల, దవాఖాన, లైబ్రరీ, పార్కులు, జిమ్‌లను నిర్వహిస్తున్నామని చెప్పారు ప్రభుత్వ, ఆయుర్వేద వైద్యాన్ని ప్రతి పౌరుడికి ఉచితంగా అందిస్తున్నామని వివరించారు. తెలంగాణలో పేదల ఇళ్ల నిర్మాణానికి రూ.5 లక్షలిస్తే, కేరళ ప్రభుత్వం రూ. 10 లక్షలు ఇస్తుందని చెప్పారు. తమ రాష్ట్రంలో మతకలహాలకు చోటు లేదన్నారు. సంపూర్ణ మతసామరస్యతను అమలు చేస్తూ దేశ సమైక్యతకు అది బాసటగా నిలుస్తోందని చెప్పారు వాకర్స్ సంఖ్యను మరింత పెంచుతూ ప్రజల ఆరోగ్యాలకు వైద్యంతో పాటు వ్యాయామం కూడా అవసరమని చెప్పారు. వాకర్స్ క్లబ్ సభ్యులు ఈ సందర్భంగా శివదాసన్‌తోపాటు కేరళ ఎమ్మెల్యేలు శాంతకుమారి, డికె మురళీగోపాల్‌ను శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వాకర్స్ ఇంటర్నేషనల్ గవర్నర్ లింగా ప్రకాష్, మాజీ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ వి నాగభూషణం పార్క్ వాకర్స్ క్లబ్ సెక్రటరీ మనోహర్ రెడ్డి, కోశాధికారి ఎం దశరథ్, ఏరియా మాజీ వైస్ ప్రెసిడెంట్ సంపత్ రెడ్డి, ఏరియా వైస్ ప్రెసిడెంట్ సంకా మురళి కృష్ణ మాజీ ప్రెసిడెంట్లు సలిపేల రమేష్ రెడ్డి, కందూరి కృష్ణ, శైలజ మోహన్, వర్కర్స్ క్లబ్ సభ్యులు టీ స్కైలాబ్ బాబు, నిమ్మల రాజశేఖర్, ఆర్ వెంకట్రాములు, కోట రమేష్, కల్లూరి రమేష్, డాక్టర్ సునీల్, రత్నాకర్ రెడ్డి, కె వీరయ్య, జి కృష్ణ పాల్గొన్నారు.

యథేచ్ఛగా నకిలీ ఒఆర్‌ఎస్ అమ్మకాలు

- న్యాయపోరాటానికి సిద్ధమవుతున్న డాక్టర్లు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నకిలీ ఒఆర్‌ఎస్ అమ్మకాలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. సూపర్ మార్కెట్లతో పాటు మెడికల్ షాపుల్లో ప్రత్యక్షమవుతున్నాయి. గతంలో మాదిరిగానే ప్రజలు ఒఆర్‌ఎస్‌కు, నకిలీ ఒఆర్‌ఎస్‌కు మధ్య ఉన్న తేడాను గుర్తించలేక తప్పుదోవ పడుతున్నారు. గల్లీ నుంచి ఢిల్లీ వరకు సాగిన సుదీర్ఘ పోరాటం తర్వాత ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఫ్‌ఎస్‌ఎస్‌ఎఐ) నకిలీ ఒఆర్‌ఎస్ అమ్మకాలకు చెక్ పడేలా ఆదేశాలు జారీ చేసింది. దీంతో ఎనర్జీ డ్రింక్‌ల పేరుతో జరిగే మోసానికి ఫుల్‌స్టాప్ పడిందని అంతా భావించారు. ఎఫ్‌ఎస్‌ఎస్‌ఎఐ ఆదేశాలతో ఎనర్జీ డ్రింక్ పేరుతో ఒఆర్‌ఎస్ బ్రాండ్‌ను ఉపయోగించుకుని మార్కెట్ చేస్తున్న పలు కంపెనీలు వెనక్కి తగ్గాయి. అయితే జెఎన్‌టిఎల్ ప్రయివేటు లిమిటెడ్ దీనిపై ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించింది. తమ వాదన వినకుండా ఏకపక్షంగా ఎఫ్‌ఎస్‌ఎస్‌ఎఐ ఆదేశాలు జారీ చేసిందని న్యాయస్థానంలో సవాలు చేసింది. దీంతో వారం రోజుల్లో వారి వాదన వినాలని న్యాయస్థానం ఎఫ్‌ఎస్-ఎస్‌ఎఐకు ఆదేశాలు జారీ చేసిన సంగతి తెలిసిందే. వారం రోజుల్లో ఆ వాదనలు విన్నప్పటికి, ఎఫ్‌ఎస్‌ఎస్‌ఎఐ దానిపై ఎలాంటి అభిప్రాయం వెల్లడించకపోగా, అంతకు ముందు వాటిని నిషేధిస్తూ జారీ చేసిన ఉత్తర్వులను కూడా పూర్తి స్థాయిలో అమలు చేయడం లేదు. దీంతో సదరు కంపెనీకి చెందిన నకిలీ ఒఆర్‌ఎస్ టెట్రా ప్యాకెట్లు మునపటి మాదిరిగానే మార్కెట్లో ప్రత్యక్షమవుతున్నాయి. దీంతో మరోసారి న్యాయపోరాటానికి సిద్ధమవుతున్నట్టు నకిలీ ఒఆర్‌ఎస్‌కు వ్యతిరేకంగా పోరాడుతున్న హైదరాబాద్‌కు చెందిన పిల్లల వైద్యురాలు డాక్టర్ శివరంజని సంతోష్ ప్రకటించారు. ఎఫ్‌ఎస్‌ఎస్‌ఎఐ వ్యవహారశైలిలో పిల్లల ప్రాణాల కన్నా కంపెనీకి నష్టం కలగకుండా చూడాలనే ధోరణి కనిపిస్తోందని వైద్యులు విమర్శిస్తున్నారు. కంపెనీ చెబుతున్న రూ.180 కోట్ల విలువైన స్టాక్ ఇది వరకే తమ వద్ద ఉంటే, ఆ కంపెనీకి నష్టం కలగకుండా చూసేందుకే ఫుడ్ సేఫ్టీ అథారిటీ ప్రాధాన్యతనిస్తున్నట్టు కనిపిస్తోంది. అందుకే ఉద్దేశపూర్వకంగా ఆ కంపెనీ వాదన విన్న తర్వాత అభిప్రాయం వెంటనే వెల్లడి చేయకపోవడం, నకిలీ ఒఆర్‌ఎస్‌ను నిషేధిస్తూ జారీ చేసిన ఆదేశాలను అమలు చేయకుండా తాత్సారం చేస్తున్నట్టు తెలుస్తోంది. ఐదేళ్ల లోపు పిల్లలకు డయేరియా సమయంలో ఉపయోగించాల్సిన ఒఆర్‌ఎస్ ఫార్ములాను ప్రపంచ ఆరోగ్య సంస్థ స్పష్టంగా పేర్కొంది. ఈ బ్రాండ్‌ను ఏ రకంగానూ దుర్వినియోగం చేయడానికి వీల్లేదు. అయితే ఆయా కంపెనీలు ఒఆర్‌ఎస్‌కు వైద్యపరంగా ఉన్న డిమాండ్‌ను తమకు అనుకూలంగా మలుచుకోవడం ద్వారా పిల్లల ప్రాణాలకు ముప్పు వాటిల్లుతుందనే ఆందోళన నెలకొంది.ప్రపంచవ్యాప్తంగా ప్రతి ఏటా డయోరియాతో 4,44,000 మంది, భారతదేశంలో ఒక లక్ష నుంచి 1.22 లక్షల మంది ఐదేళ్లలోపు పిల్లలు మరణిస్తున్నట్టు గణాంకాలు చెబుతున్నాయి. సమస్య తీవ్రతను దృష్టిలో పెట్టుకుని నిర్ణయాలు శరవేగంగా తీసుకోవాల్సిన ఫుడ్ సేఫ్టీ అథారిటీ మాత్రం కార్పొరేట్ ఒత్తిడికి తలొగ్గాయనే చర్చ వైద్యవర్గాల్లో జోరుగా సాగుతోంది. వాదన వినలేదన్న సాంకేతిక అంశానికి ప్రాధాన్యతనిచ్చిన కోర్టు... తాను కల్పించిన వెసులుబాటు ముసుగులో ఫుడ్ సేఫ్టీ అథారిటీ నకిలీ ఒఆర్‌ఎస్‌ల అమ్మకాన్ని కొనసాగించడాన్ని చోద్యంలా చూస్తోందని ఆరోగ్య పరిరక్షణ ఉద్యమకారుల నుంచి ఆగ్రహం వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో కార్పొరేట్ లాభనష్టాల గురించి కాకుండా పిల్లల ప్రాణాల దృష్ట్యా నకిలీ ఒఆర్‌ఎస్‌పై నిషేధాన్ని పూర్తి స్థాయిలో అమలు చేయాలని ప్రజారోగ్య పరిరక్షణ ఉద్యమకారులు డిమాండ్ చేస్తున్నారు.

28న పంట కొనుగోళ్లపై రైతులకు అవగాహన

- వ్యవసాయ శాఖ డైరెక్టర్ గోపి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రైతు నేస్తం కార్యక్రమం ద్వారా పంట కొనుగోళ్లపై రైతులకు అవగాహన కల్పిస్తామని వ్యవసాయ శాఖ డైరెక్టర్ డాక్టర్ బి.గోపి తెలిపారు. మంగళవారం జరగనున్న కార్యక్రమంలో మార్కెటింగ్, మార్క్‌ఫెడ్, సిసిఐ, వ్యవసాయ శాఖ అధికారులు రైతు నేస్తం ద్వారా రైతుల సందేహాలను నివృత్తి చేస్తారని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రైతులందరూ తమకు దగ్గరలో ఉన్న రైతు వేదికల ద్వారా పాల్గొని సందేహాలను నివృత్తి చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.



రాష్ట్రంలో రౌడీషీటర్ల పాలన : కెటిఆర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో రౌడీ షీటర్ల పాలన నడుస్తున్నదని బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ విమర్శించారు. ఆదివారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో హోటల్ కార్మికుల యూనియన్ నేతలతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పలువురు హోటల్ కార్మికులు బీఆర్‌ఎస్‌లో చేరారు. బీఆర్‌ఎస్ పాలనలో హోటల్ కార్మికులకు ఎలాంటి ఇబ్బందులు కలిగించలేదన్నారు. మంత్రి ఓఎస్డీ తుపాకీతో బెదిరించారనీ, తుపాకీ మంత్రి భర్తే ఇచ్చారని పోలీసులు అంటున్నారని తెలిపారు. తుపాకీతో రోహిన్‌రెడ్డి బెదిరించాడా? సుమత్ బెదిరించాడా? అని ప్రశ్నించారు. అలీబాబా దొంగల ముఠాతో వేగలేక మంచి ఐఏఎస్ రాజీనామా చేశారన్నారు. లిక్కర్ బాటిల్స్ స్టిక్కర్ కాంట్రాక్టు కోసం సిఎం అల్లుడు,మంత్రి కొడుకు పోటీ పడ్డారని విమర్శించారు. రెండేండ్ల పాలనలో తెలంగాణను కాంగ్రెస్ ప్రభుత్వం నాశనం చేసిందని విమర్శించారు. హైడ్రా పేరుతో పేదల ఇండ్లను కూల్చడం దారుణమన్నారు. కారు కావాలా...? బుల్డోజర్ కావాలా...?అనే దాన్ని ప్రజలే తేల్చుకోవాలన్నారు. హైదరాబాద్ నగరంలో ఓటింగ్ రోజు ప్రజలు ఓట్లకు రారనే ముద్ర ఉందనీ, ఈసారి ప్రతి ఒక్కరు వచ్చి ఓటేసి బిఆర్‌ఎస్ అభ్యర్థిని గెలిపించాలని కోరారు.

సామ్రాజ్యవాదాన్ని ఎదిరించేది ఎర్రజెండానే..

- బిసి రిజర్వేషన్లు అడ్డుకుంటున్న అసలు దోషి బిజెపి : తమ్మినేని
- పాషా, నరహరి ఆశయ స్ఫూర్తితో ఉద్యమాలు
- ఇబ్రహీంపట్నంలో పాషా, నరహరి 36వ వర్ధంతి సభ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

దోపిడీ, పేదలు, అణిచివేత, అవినీతి, అరాచకత్వం ఉన్నన్ని రోజులు ఎర్రజెండా బతికే ఉంటుందని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం స్పష్టం చేశారు. కమ్యూనిస్టులను లేకుండా చేయాలని చూస్తున్న సామ్రాజ్యవాద, పెట్టుబడిదారీ, పాలక పక్షాలు.. ముందు పేదరికం, దోపిడీ లేని సమాజాన్ని నిర్మించాలని హితవుపలికారు. పాషా, నరహరి అమరుల ఆశయ స్ఫూర్తితో భవిష్యత్తు ఉద్యమాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. అమరవీరులు పాషా, నరహరి 36వ వర్ధంతిని రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలోని అంబేద్కర్ చౌరస్తాలో ఆదివారం నిర్వహించారు. అంతకు ముందు ఆర్టీసీ డిపో నుంచి చౌరస్తా వరకు భారీ ర్యాలీ చేపట్టారు. ముందుగా పాషా, నరహరి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి సామెల్ అధ్యక్షతన జరిగిన బహిరంగ సభలో తమ్మినేని మాట్లాడారు. ఎర్రజెండా నాయకత్వంలోనే పేదలు, రైతులు, కూలీలు ఉద్యమించి తన హక్కులు సాధించుకుంటున్నారని అన్నారు. కమ్యూనిస్టులకు సీట్లు, ఓట్లు ముఖ్యం కాదన్నారు. ఉద్యమాల్లో హత్యలు, లాఠీలు, తూటాలు, కేసులకు ఎర్రజెండా నాయకత్వం ఎదురొడ్డి నిలబడుతోందని తెలిపారు. 170 ఏండ్ల చరిత్ర కలిగిన కమ్యూనిజం పడి లేచిన కెరటంలా విస్తరిస్తోందన్నారు.

నేడు ప్రపంచ వ్యాప్తంగా ఉద్యమాలు విస్తరిస్తున్నాయని తమ్మినేని అన్నారు. అమెరికన్ సామ్రాజ్యవాదాన్ని సైతం ఎర్రజెండా ఎదిస్తోందన్నారు. అమెరికా రూ.37 లక్షల కోట్ల డాలర్ల అప్పుల్లో కూరుకుపోయిందని, ఈ అప్పుల నుంచి బయటపడేందుకు ప్రపంచ దేశాల మీద సుంకాలు విధిస్తోందని తెలిపారు. దాంతో అన్ని దేశాలూ వణికిపోతున్నాయన్నారు. చైనా మాత్రమే అమెరికాను ఎదిరించి నిలబడుతుందని తెలిపారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం బిసి రిజర్వేషన్లకు అడ్డు పడుతోందన్నారు. 42శాతం రిజర్వేషన్లపై రాష్ట్ర ప్రభుత్వ అసెంబ్లీలో తీర్మానం చేసి పంపిస్తే గవర్నర్ సంతకం చేయకుండా, కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలపకుండా బిసి సమాజాన్ని మోసం చేస్తున్నారని అన్నారు. రిజర్వేషన్లను అడ్డుకోవడంలో అసలు దోషి బీజేపేనని విమర్శించారు. కేంద్రంలో బిసి జనగణన చేయాలని అన్ని రాజకీయ పక్షాలు ఏకాభిప్రాయాన్ని వ్యక్తం చేసినా మోడీ ప్రభుత్వం ఎందుకు చేయడం లేదని ప్రశ్నించారు. బిసి రిజర్వేషన్లు సాధించుకునేందుకు అన్ని రాజకీయ పక్షాలు ఢిల్లీలో కూర్చొని తేల్చుకునేందుకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. రాజ్యాంగాన్ని లేకుండా చేయాలని చూస్తున్న మోడీ ప్రభుత్వాన్ని అడుగడుగునా అడ్డుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు.

రాష్ట్రంలో ఫోర్త్ సిటీ పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం పేద రైతుల నుంచి భూములు లాక్కొంటోందని తమ్మినేని అన్నారు. మరోవైపు ట్రిబుల్‌ఆర్ పేరుతో రైతుల నుంచి భూములు తీసుకుంటుందన్నారు. తాము అధికారంలోకి వస్తే ఫార్మాసిటీని రద్దు చేస్తామని చెప్పిన కాంగ్రెస్.. నేడు అదే ఫార్మాసిటీని కొనసాగించడం ఏమిటని ప్రశ్నించారు. మరోవైపు ఫ్యూచర్ సిటీ పేరుతో మరిన్ని భూములను కాంగ్రెస్ ప్రభుత్వం సేకరిస్తుందన్నారు. ఈ విధానం సరైనది కాదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలపై సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. అప్పుడే పాషా, నరహరిలకు నిజమైన నివాళులు అర్పించిన వారమవుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య, కార్యదర్శివర్గ సభ్యులు కాడిగళ్ల భాస్కర్, డి.రాంచందర్, బి.సామెల్, జగదీష్, కందుకూరి జగన్, ఏర్పాల నర్సింహ, జిల్లా కమిటీ సభ్యులు అలంపల్లి నర్సింహ, రావుల జంగయ్య, సిహెచ్ బుగ్గరాములు, సీహెచ్ జంగయ్య, డి.కిషన్, కె.శ్రీనివాస్‌రెడ్డి, గోరెంకల నర్సింహ, పి.జగన్, పి.అంజయ్య, మున్సిపల్ కార్యదర్శి ఎల్లేశ్, ఎస్‌ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శంకర్, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ప్రకాష్ కరత్, ప్రజానాట్య మండలి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాజశేఖర్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.



పాషా, నరహరి వర్ధంతి సభలో మాట్లాడుతున్న తమ్మినేని

తెలంగాణ పత్తి రైతుల సంఘం నూతన రాష్ట్ర కన్వీనర్‌గా భూక్యచందునాయక్ ఎన్నిక

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ పత్తి రైతుల సంఘం నూతన రాష్ట్ర కన్వీనర్‌గా భూక్యచందునాయక్ ఎన్నికయ్యారు. శుక్రవారం జనగామ జిల్లాలో నిర్వహించిన రాష్ట్ర సదస్సులో తెలంగాణ పత్తి రైతుల సంఘం నూతన రాష్ట్ర కమిటీ ఎన్నుకున్నారు. ఆ సంఘం కో-కన్వీనర్లుగా మూడ్ శోభన్ (రాష్ట్ర కేంద్రం), పుచ్చకాయల కష్ణారెడ్డి(వరంగల్), చెల్పూరి రాము (కరీంనగర్), బొబ్బ వెంకటరెడ్డి (మహబూబాబాద్), జి.రామన్న (అదిలాబాద్), చిలుక బాల్‌రెడ్డి (నాగర్‌కర్నూల్), వాసిరెడ్డి వరప్రసాద్(ఖమ్మం), ఎస్‌కే సైదా(సూర్యాపేట) ఎన్నికయ్యారు.రాష్ట్ర కమిటీ సభ్యులుగా చల్ల నరసింహారెడ్డి (వరంగల్), చింతల రజనీకాంత్ (భూపాలపల్లి), గుండేటి వాసుదేవ్ (కరీంనగర్), వాకుడోత్ కోబాల్, ఎం.సాంబశివరావు (కొత్తగూడెం), మావేటి కోటయ్య (మహబూబాబాద్), ఎం.కనకాచారి (సిద్ధిపేట), ఎర్రనాయక్ (నల్గొండ), వెంకటేశ్వరరావు (ఖమ్మం), మంగ బీరయ్య (జనగాం), సత్యరాజయ్య (భువనగిరి) తదితరులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

డివైఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఒయు రీసెర్చ్ స్కాలర్ ఆర్‌ఎల్ మూర్తి ఎన్నిక

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

డివైఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఒయు రీసెర్చ్ స్కాలర్ ఆర్ ఎల్ మూర్తి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆయన ఉన్నత విద్య కోసం కాకతీయ విశ్వవిద్యాలయం నుండి ఉస్మానియా యూనివర్సిటీకి వచ్చి రీసెర్చ్ స్కాలర్ గా చదువుతూ తెలంగాణ ఉద్యమ కాలం నుండి ఎస్‌ఎఫ్ఐ ఉద్యమాల్లో క్రియాశీలకంగా పని చేశారు. ఉస్మానియా అధ్యక్షుడిగా కార్యదర్శిగా రెండుసార్లు, పనిచేశారు. ఆ తర్వాత రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా, 2019లో రాష్ట్ర అధ్యక్షుడిగా, కేంద్ర కమిటి సభ్యుడిగా బాధ్యతలు నిర్వర్తించారు. అనేక విద్యార్థి ఉద్యమాలను నిర్వహించిన ఆయన విద్యార్థి సంఘం నుంచి రిలీవ్ కావటంతో డివైఎఫ్ఐ తెలంగాణ రాష్ట్ర విస్తృస్థాయి సమావేశంలో ఆ సంఘం జాతీయ అధ్యక్షులు, రాజ్య సభ సభ్యులు మూర్తికి సభ్యత్వం ఇచ్చారు. అనంతరం డివైఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా మూర్తిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ ఎన్నిక పట్ల విద్యార్థి, యువజన మిత్రులు ప్రొఫెసర్లు హర్షం వ్యక్తం చేశారు.

మిల్లర్ల కొర్రీలు

- 10 శాతం డిపాజిట్ చేసేందుకు ససేమిరా..
- మిల్లు ట్యాగింగ్ తంటా.. కేంద్రాల నిర్వాహకుల అవస్థలు
- తడిసి ముద్ద అవుతున్న ధాన్యం
- 15 రోజుల నుంచి చేరుకుంటున్న పంట
- పేరుకే ప్రారంభమైన 296 ధాన్యం కొనుగోలు కేంద్రాలు
- ఒక్క గింజ కూడా కొనుగోలు చేయలేదు
- గోస పెడుతున్న రైతులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వానాకాలం ధాన్యం పంట రైతు చేతికొస్తోంది. ఆ పంటను రైతులు అమ్ముకోవడానికి ఏర్పాట్లు చేశామని అధికారులు చెప్పినా అవి ఎక్కడా కనిపించడం లేదు. పేరుకే ఐకేపీ, పీఏసీఎస్ కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఎక్కడా గింజ కూడా కాంటా వేయలేదు. జీవో నెం.17 ప్రకారం పంట కొనుగోళ్లకు 10శాతం డిపాజిట్ చేసేందుకు మిల్లర్లు ససేమిరా అంటుండటం.. మిల్లుల ట్యాగింగ్ కాకపోవడంతో కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు అవస్థలు పడుతున్నారు. మరోవైపు పంట అమ్ముకోలేక ధాన్యం రాశులతో రైతులు గోస పడుతున్నారు. ఈ క్రమంలో అకస్మాత్తుగా భారీ వర్షాలు కురుస్తుండటంతో పంట మొత్తం తడిసిముద్దవుతోంది.

నల్లగొండ జిల్లాలో 15 రోజుల కిందట నుంచే రైతులు పంటను కోతలు కోసి కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చి ఆరబెడుతున్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రం కోసం దొడ్డు రకం, సన్న రకం వేర్వేరు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని అధికారులు ప్రకటించారు. జిల్లాలో మొత్తం 375 కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల కోడ్ అమలైందని అధికారులు అట్టహాసంగా 296 కేంద్రాలను ప్రారంభించారు. సూర్యాపేటలో 296 కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు.

పేరుకే ప్రారంభం

నల్లగొండ జిల్లా వ్యాప్తంగా 6 లక్షల 30 వేల టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. 296 కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. కానీ ఇంతవరకు ఒక్క గింజ కూడా కొనుగోలు చేయలేదు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు ధాన్యం తడిసి ముద్దవుతోంది. కండ్ల ముందట ధాన్యం వర్షార్పణం అవుతుండటంతో రైతులు లబోదిబోమంటున్నారు. ఇప్పటివరకు మిల్లుల ట్యాగింగ్ కాకపోవడంతో నిర్వాహకులు కేంద్రాల్లో ఖాళీగా కూర్చుని పోతున్నారు. రైతులు తీసుకొచ్చిన ధాన్యానికి తూకం వేయడానికి ఇంకా అనుమతులు రాలేదని చెబుతున్నారు. దీనిని అదునుగా చూసి ప్రయివేటు వారు ధాన్యాన్ని కొంటామని చెప్పి తక్కువ రేటు చెబుతున్నారని తెలిసింది.


మిల్లర్ల కొర్రీ

ఐకేపీ కొనుగోలు కేంద్రాల్లో కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిల్లర్లకు పంపించడం.. అక్కడి నుంచి సీఎంఆర్ బియ్యంగా మిల్లర్లు ప్రభుత్వానికి ఇవ్వడంతో తీవ్ర జాప్యం జరుగుతోంది. దీంతో ప్రభుత్వం ముందస్తుగా సీఎంఆర్ బియ్యంకు సరిపడా 10 శాతం డబ్బులు డిపాజిట్ చేయాలని జీవో నెంబర్ 17 విడుదల చేసింది. అయితే, డబ్బులు ముందస్తుగా చెల్లించడం కుదరదని మిల్లర్లు ఇప్పటికే జిల్లా పౌరసరఫరాల అధికారికి వినతిపత్రం సమర్పించినట్టు తెలిసింది. ముందస్తుగా జీవో నెంబర్ 17 ప్రకారం 10శాతం బ్యాంకు డిపాజిట్ చేసేందుకు మిల్లర్లు నిరాకరిస్తున్నారు.

ట్యాగింగ్ కాక..

రైతులు పండించిన పంటను కొనుగోలు కేంద్రాలకు పదిహేను రోజులుగా తీసుకొచ్చి ఆరబెడుతున్నా.. అధికారులు మాత్రం ఇంకా మిల్లు ట్యాగింగ్ చేయలేదు. కేంద్రాలు ప్రారంభమై ఐదు రోజులు గడిచినప్పటికీ ధాన్యాన్ని కాంటా వేయడం లేదు. రైతుల ధాన్యం వర్షాలకు తడిసి ముద్ద అవుతుండటంతో నిర్వాహకులు వారికి సమాధానం చెప్పలేకపోతున్నారు.

కొనుగోళ్లను వెంటనే ప్రారంభించాలి
రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు ముదిరెడ్డి సుధాకర్ రెడ్డి

ధాన్యం కొనుగోలు కేంద్రాలలో వెంటనే కొనుగోళ్లు ప్రారంభించాలి. ప్రకృతి వైపరీత్యాలకు రైతు నష్టపోకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. కేంద్రాలకు ధాన్యం తీసుకొచ్చి 15 రోజుల నుంచి రైతులు ఎదురు చూస్తున్నా కాంటా వేయకపోవడం సరికాదు. వెంటనే ధాన్యాన్ని తూకం వేయాలి.

15 రోజులుగా గోస పడుతున్నాంమహిళా రైతు భాగ్య, ఖాజీరామరం

ప్రభుత్వం మద్దతు ధరతో పాటు 500 రూపాయల బోనస్ ఇస్తుందన్న ఆశతో మిల్లులకు పోలేదు. తమ మూడెకరాల పంటలో సగభాగం నల్లగొండ పట్టణంలోని అర్జాలబావి కొనుగోలు కేంద్రానికి 15 రోజుల కిందట తీసుకొచ్చాం. ఇంకా కాంటాలు వేయకపోవడంతో రోజూ కురుస్తున్న వర్షానికి ధాన్యం తడుస్తోంది. తడవకుండా జాగ్రత్తపడటానికి గోస పడుతున్నాం. వెంటనే కొనుగోళ్లు మొదలెట్టాలి.

వికలాంగులపై కేంద్రం నిర్లక్ష్యం

- పింఛన్‌ను వాటా పెంపులో మోడీ ప్రభుత్వం వ్యతిరేకం
- దేశవ్యాప్త ఉద్యమానికి ఎన్‌పిఆర్‌డి శ్రీకారం : గిరీష్ కీర్తి
- సామాజిక అసమానతలను పెంచిపోషిస్తున్న కేంద్రం : మురళీధరన్



సమావేశంలో మాట్లాడుతున్న గిరీష్ కీర్తి

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

మనువాదం వికలాంగుల హక్కులకు వ్యతిరేకమని, కేంద్ర ప్రభుత్వం సామాజిక అసమానతలను పెంచిపోషిస్తున్నదని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక (ఎన్‌పిఆర్‌డి) జాతీయ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గిరీష్ కీర్తి, మురళీధరన్ తెలిపారు. ఆదివారం హైదరాబాద్‌లో ఎన్‌పిఆర్‌డి జాతీయ కమిటీ సమావేశాన్ని వర్కింగ్ ప్రెసిడెంట్ నంబురాజన్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా గిరీష్ కీర్తి మాట్లాడుతూ ట్రంప్ విధిస్తున్న సుంకాలు సామాజిక భద్రత, విద్యా, వికలాంగుల హక్కులపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మోడీ అనుసరిస్తున్న సరళీకృత ఆర్థిక విధానాల వల్ల నిరుద్యోగం, ఆర్థిక అసమానతలు పెరిగిపోతున్నాయని చెప్పారు. అనేక వస్తువులపై జీఎస్‌టీ తగ్గించిన కేంద్ర ప్రభుత్వం గతంలో వికలాంగులకు ఇచ్చిన జీఎస్‌టీ రాయితీలను ఎందుకు ఉపసంహరించుకుందని ప్రశ్నించారు. దేశాన్ని హిందూ మత విలువలతో నింపాలని కేంద్రం ప్రయత్నం చేస్తున్నదని ఆరోపించారు. ప్రజల మధ్య మతపరమైన ఉద్రిక్తలను సృష్టిస్తున్నదని తెలిపారు. వికలాంగుల క్రీడల కోసం దేశవ్యాప్తంగా పారా స్పోర్ట్స్ పాలసీ ప్రకటించాలని డిమాండ్ చేశారు. అంతర్జాతీయ పార్పుల్ ఫెస్ట్ ప్రచారం కోసమే తప్ప వికలాంగుల కోసం కాదని తెలిపారు. దేశంలో 150 మిలియన్ల ప్రజలు ఏదో ఒక రకమైన మానసిక ఆరోగ్య రుగ్మతలతో బాధపడుతున్నారని చెప్పారు. మానసిక వికలాంగుల సంరక్షణను కేంద్ర ప్రభుత్వం గాలికి ఒదిలివేస్తున్నదని విమర్శించారు. 2017 మానసిక ఆరోగ్య సంరక్షణ చట్టం అమలు చేయడంలో కేంద్ర ప్రభుత్వం తీవ్రమైన నిర్లక్ష్యం చేస్తున్నదని తెలిపారు. భారత రాజ్యాంగం కల్పించిన జీవించె హక్కును మానసిక వికలాంగులు కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వికలాంగులకు భీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం వికలాంగులకు ఇస్తున్న పింఛన్లలో వాటాను రూ. ఐదు వేలకు పెంచే వరకు ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల్లో వికలాంగులకు ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేశారు. వికలాంగుల చట్టాలను అమలు చేయకుండా వాటిని నిర్వీర్యం చేయడానికి కుట్రలు చేస్తున్నదని ఆరోపించారు.

మురళీధరన్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఉంటున్న ప్రజలలో ఆర్థిక అసమానతలు పెరుగుతున్నా కేంద్రం పట్టించుకోవడం లేదని వివరించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలకు నిధుల కోత విధిస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వ రంగంలో వికలాంగుల ఉద్యోగ అవకాశాలను తిరస్కరిస్తున్నదని తెలిపారు. ఉద్యోగ నియామకాల్లో వికలాంగులను పరిగనలలోకి తీసుకోవాలని సుప్రీం కోర్ట్ చెప్పినా మోడీ పట్టించుకోవడం లేదని విమర్శించారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న పరీక్షల విధానం వికలాంగులకు అనుకూలంగా లేదని చెప్పారు. ప్రజారవాణా వికలాంగులకు అందుబాటులో లేదని తెలిపారు. వికలాంగులు గౌరవంగా జీవించేందుకు ఇళ్లు, ఇళ్లస్థలాలు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఆటీజం, మానసిక వైకల్యం, బహుళ వైకల్యం కలిగిన పిల్లలకు సమగ్ర విద్యా అందించే బాధ్యత ప్రభుత్వనికి లేదా అని ప్రశ్నించారు. విద్యాహక్కు చట్టం, 2016 ఆర్‌పీడబ్ల్యూడీ చట్టం ప్రకారం ప్రభుత్వ పాఠశాలల్లో సమ్మిళిత విద్యాను పొందే హక్కు ఉందని గుర్తు చేశారు. కేరళ ప్రభుత్వం ప్రకటించిన విజన్ కేరళ 2031 వికలాంగుల జీవితాల్లో మార్పులు తీసుకువస్తున్నదని తెలిపారు. వికలాంగుల అభివృద్ధి, జీవన నాణ్యతను పెంచేందుకు కేరళ ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు. ప్రజా ప్రదేశాలు, రవాణా, గృహనిర్మాణం, డిజిటల్ ప్లాట్‌ఫారాలు, విద్యా సంస్థలు, ఆస్పత్రుల్లో మెరుగైన సౌకర్యాలు 100 శాతం కల్పించేందుకు ప్రభుత్వం నిర్ణయం చేసిందని గుర్తు చేశారు..వికలాంగుల కోసం ఉన్న స్వయం ప్రతిపత్తి కలిగిన సంస్థలను మూసేయాలనే కేంద్ర ప్రభుత్వ కుట్రలను తిప్పికొడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో జాతీయ ఉపాధ్యక్షులు ఎం అడివయ్య, జాన్సీ, సహాయ కార్యదర్శి రిషికేష్, కోశాధికారి చక్రవర్తి, కేంద్ర కమిటీ సభ్యులు కె వెంకట్, ఆర్ వేంకటేశ్, జె రాజు, రంగప్ప, రాజన్, విల్సన్, భారతి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న గురుకుల పాఠశాల విద్యార్థిని

గురుకుల విద్యార్థులకు ఎంబిబిఎస్ సీట్లు

- విద్యార్థులను సన్మానించిన కెటిఆర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అన్ని వర్గాల సంక్షేమానికి ప్రత్యేకమైన విజన్ ఉన్న నాయకుడు కేసీఆర్ అని మాజీ మంత్రి, బిఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి రామారావు అన్నారు. ఆదివారం సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌లోని గురుకులాల్లో చదివి ఎంబిబిఎస్ సీట్లు సాధించిన విద్యార్థులతో తెలంగాణ భవన్‌లో మాజీ మంత్రి హరీశ్‌రావుతో కలిసి సమావేశమై సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నాడు రాష్ట్రంలో 1022 గురుకుల పాఠశాలలు కేసీఆర్ హయాంలో ఏర్పాటు చేశారన్నారు. ఈరోజు వేలమంది గురుకుల పాఠశాలల విద్యార్థులు ఇంజనీర్లు, లాయర్లు, డాక్టర్లు ఇతర అనేక వృత్తుల్లోకి విజయవంతంగా ప్రవేశించారంటే అది కెసిఆర్ దార్శనికత వల్లే అని అన్నారు. ఒక్క గురుకుల స్కూల్ నుంచే 16 మంది మెడికల్ కాలేజీల్లో సీట్లు సాధించారని అభినందించారు. రాష్ట్రంలో 2014లో కేవలం నాలుగు మెడికల్ కాలేజీలు ఉంటే నేడు 34 మెడికల్ కాలేజీలు అయ్యాయని తెలిపారు. మంచి విద్యా అవకాశాలు కల్పిస్తే ప్రతి ఒక్క పేద తల్లిదండ్రులు తమ బిడ్డలకు విద్య అందించేందుకు సంసిద్ధంగా ఉంటారని కేసీఆర్ గతంలో చెప్పారని అన్నారు. ఒక్క దీపంతో ఇంకొక దీపాన్ని వెలిగించి చీకట్లను తరిమి వేసినట్టుగా, ఈరోజు ప్రభుత్వ సహకారంతో డాక్టర్లుగా మారిన మీరంతా ఇతరులకు సహాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాణిక్ రావు, డిసిఎంఎస్ చైర్మన్ శివకుమార్, వివిధ మండలాల పార్టీ అధ్యక్షులు తట్టు నారాయణ, వెంకటేశం, సంజీవరెడ్డి, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

వడ్డెరలకు రాజకీయంగా న్యాయం చేస్తాం:కెటిఆర్

రాజకీయంగా వడ్డెరలకు తమ పార్టీ తరపున న్యాయం చేస్తామనీ, ఈ విషయంపై కెసిఆర్‌తో మాట్లాడుతామని బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారకరామారావు భరోసానిచ్చారు. ఆదివారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో వడ్డెర సంఘం నాయకులతో సమావేశం నిర్వహించారు. అందులో మాజీ మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, తాత మధు, తదితరులు పాల్గొన్నారు. సమావేశంలో కెటిఆర్ మాట్లాడుతూ..కాంగ్రెస్ కాకమ్మ కథల్ని హైదరాబాద్ ప్రజలు నమ్మలేదనీ, నగరంలో బిఆర్ఎస్ ఎమ్మెల్యేలను గెలిపించారని గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్కటంటే ఒక్క మంచి పని కూడా చేయలేదనీ, హైడ్రా పేరుతో పేదల ఇండ్లను కూల్చుతున్నదని విమర్శించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికతో ప్రజల్ని మరోమారు మోసం చేసేందుకు యత్నిస్తున్నదని విమర్శించారు. కంటోన్మెంట్ ఎన్నికలో గెలిచి ఏం సాధించిందని ప్రశ్నించారు. డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల పేరు చెప్పి ప్రజల్ని మోసం చేసిందన్నారు. కేసీఆర్ ఎప్పుడు కూడా కులం, మతం పేరుతో రాజకీయం చేయలేదని తెలిపారు. రానున్నది తమ ప్రభుత్వమేననీ, జూబ్లీహిల్స్ ఉప ఎన్నికతోనే అది ప్రారంభమవుతుందని చెప్పారు.

ట్రావెల్స్ బస్సులపై కొనసాగుతున్న ఆర్‌టిఎ దాడులు

- రెండవరోజు 21 బస్సులపై కేసులు నమోదు
- రూ.69వేల జరిమానా వసూలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నగర శివారులోని రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో రవాణా శాఖ అధికారులు ఆదివారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. నిబంధనలు ఉల్లంఘించిన పలు ప్రయివేట్ బస్సులపై కేసులు నమోదు చేసి.. జరిమానాలు విధించారు. ఈ తనిఖీల్లో భాగంగా మొత్తం 21 కేసులు నమోదు కాగా, రూ. 69 వేల జరిమానా వసూలు చేశారు. హైదరాబాద్ జాయింట్ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ (జెటిసి) సి.రమేష్ ఆదేశాల మేరకు ప్రయివేటు ట్రావెల్స్ బస్సులపై ఆర్టీఏ అధికారుల ప్రత్యేక బృందాలు తనిఖీలు చేపడుతున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా సౌత్ జోన్ ఆర్టీఏ కార్యాలయ పరిధిలో 11 బస్సులపై కేసులు నమోదయ్యాయి. డ్రైవర్లు, సిబ్బంది యూనిఫామ్ ధరించకపోవడం, అగ్నిమాపక యంత్రాలు (ఫైర్ ఎక్స్‌టింగ్విషర్లు) అందుబాటులో ఉంచకపోవడం వంటి ఉల్లంఘనలకు గాను మొత్తం రూ. 31వేల జరిమానా విధించారు. ఇక ఆర్‌టిఎ ఈస్ట్ జోన్ అధికారులు జరిపిన తనిఖీల్లో 3 బస్సులపై కేసులు నమోదు చేసి, రూ.3వేల జరిమానా వసూలు చేశారు. రంగారెడ్డి డీటీసీ ఆధ్వర్యంలో జరిగిన తనిఖీల్లో ఏడు బస్సులపై కేసులు నమోదు చేశారు. ప్రధానంగా అగ్నిమాపక యంత్రాలు లేని కారణంగా ఈ బస్సులకు రూ. 35 వేల జరిమానా విధించారు. ప్రయాణికుల భద్రత దృష్ట్యా బస్సుల్లో తప్పనిసరిగా ఫైర్ ఎక్స్‌టింగ్విషర్లు, ఫస్ట్ ఎయిడ్ కిట్స్ వంటి అత్యవసర సౌకర్యాలు అందుబాటులో ఉంచాలని, సిబ్బంది తప్పనిసరిగా యూనిఫామ్ ధరించాలని హైదరాబాద్ జెటిసి సి.రమేష్ స్పష్టం చేశారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి తనిఖీలు కొనసాగుతాయనీ, నిబంధనలు పాటించని వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



బస్సులను తనిఖీ చేస్తున్న పోలీసులు

గుప్తనిధుల కోసం తవ్వకాలు

- 8 మందికి రిమాండ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గుప్త నిధుల కోసం అటవీ ప్రాంతంలో అక్రమంగా తవ్వకాలు జరిపిన ఎనిమిది మందిని అటవీ శాఖ అధికారులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించిన ఘటన కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్(టి)లో చోటుచేసుకుంది. ఇన్‌చార్జి ఎఫ్‌ఆర్‌ఓ ప్రవీణ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. సిర్పూర్(టి) మండలం హీరాపూర్ గ్రామానికి చెందిన నన్న రాజేష్ (రాజు) గతంలో ఒక కేసులో జైలులో శిక్ష అనుభవిస్తున్న సమయంలో కోటాల మండలం గుండాయిపేటకు చెందిన రామ్‌టెంకి రాహుల్‌తో పరిచయం ఏర్పడింది. అటవీ ప్రాంతంలో గుప్త నిధులున్నాయని, జైలు నుంచి విడుదలైన తర్వాత చూపిస్తానని రాజేష్ రాహుల్‌కు చెప్పాడు. జైలు నుంచి బయటకు వచ్చిన రాజేష్ లక్ష్మీపూర్ శివారులోని అటవీ ప్రాంతంలో ఓ ప్రదేశంలో తవ్వకాలు చేసి అక్కడి రాళ్లకు బంగారు రంగు పూసి వాటి ఫోటోలు, వీడియోలు తీసి రాహుల్‌కు పంపించాడు. నిజంగానే బంగారం ఉన్నట్టు నమ్మిన రాహుల్ ఈ నెల 20న గుండాయిపేటకు చెందిన పాల్ రవి, దుర్గం మారుతి, గొంగ్లే కిషోర్, చల్లూర్కార్ సాజన్, రామ్‌టెంకి సునీల్, కనికి గ్రామానికి చెందిన దుర్గం రాజారాంతో కలిసి గుప్తనిధుల కోసం అటవీ ప్రాంతానికి వెళ్లి తవ్వకాలు ప్రారంభించారు. ఈ సమాచారం తెలుసుకున్న అటవీ అధికారులు అక్కడికి చేరుకొని వారిని పట్టుకున్నారు. అనుమతి లేకుండా అటవీప్రాంతంలోకి ప్రవేశించి తవ్వకాలు జరిపినందుకు, జంతువుల ఆవాసాలను ధ్వంసం చేసినందుకు, వాటి సంచారానికి ఆటంకం కలిగించినందుకు కేసు నమోదు చేశారు. అరెస్ట్ చేసిన వారిని జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి ఎదుట హాజరుపరచగా 13 రోజుల రిమాండ్ విధించారు. కేసు విచారణలో డిఆర్ఓ శశిధర్ బాబు, బీట్ ఆఫీసర్లు హబీబా, రవీనా, నరేష్, అరవింద్ పాల్గొన్నారు.

టిజిజిపిడబ్ల్యుయు అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా పైళ్ల గణపతిరెడ్డి, పాలడుగు సుధాకర్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ గ్రామపంచాయతీ ఎంప్లాయీస్, వర్కర్స్ యూనియన్ (టిజిజిపిడబ్ల్యుయు - సిఐటియు అనుబంధం) గౌరవాధ్యక్షులుగా పాలడుగు భాస్కర్, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా పైళ్ల గణపతిరెడ్డి, పాలడుగు సుధాకర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు ఆదివారం ఆ యూనియన్ ఒక ప్రకటన విడుదల చేసింది. మహబూబాబాద్ జిల్లా గార్లలో జరిగిన యూనియన్ రాష్ట్ర ఐదో మహాసభల్లో నూతన కమిటీని ఎన్నుకున్నట్టు తెలిపింది. నూతన కమిటీలో రాష్ట్ర ఆఫీస్ బేరర్లుగా 27 మంది, కమిటీ సభ్యులుగా 53 మంది, మొత్తంగా 80 మందితో కమిటీని ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని పేర్కొంది. ఆ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా చాగంటి వెంకటయ్య, కోశాధికారిగా తునికి మహేశ్, రాష్ట్ర మహిళా కన్వీనరుగా పొట్ల యాదమ్మ ఎన్నికయ్యారని తెలిపింది.


విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న చుక్క రాములు

కార్మిక వ్యతిరేక విధానాలపై ఐక్య పోరాటాలు

- సిఐటియు రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చుక్క రాములు, పాలడుగు భాస్కర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్మిక చట్టాలను తుంగలో తొక్కి.. యాజమాన్యాలకు అనుకూలంగా నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకొచ్చిందని సిఐటియు రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు చుక్క రాములు, పాలడుగు భాస్కర్ అన్నారు. కార్మిక హక్కులను హరిస్తున్న కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా కార్మికులు ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా చర్లపల్లిలోని సిఐఎ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. సిఐటియు.. కార్మిక వర్గాన్ని ఐక్యం చేస్తూ, కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తుందని అన్నారు. సిఐటియు ఆలిండియా మహాసభలు డిసెంబర్ 31 నుంచి 2026 జనవరి 5 వరకు ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నంలో జరగనున్నాయని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర మహాసభలు మెదక్ పట్టణంలో డిసెంబర్ 7 నుంచి 9వ తేదీ వరకు మూడు రోజులపాటు నిర్వహించనున్నట్టు చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో మహాసభలు జరుగుతున్నాయని, గత మూడు సంవత్సరాల కార్యక్రమాలపై సమీక్ష జరిపి, రాబోయే మూడు సంవత్సరాల భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయబోతున్నామని తెలిపారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం 2014లో అధికారంలోకి వచ్చిన తరువాత నుంచి కార్మిక చట్టాలను పూర్తిగా ఉల్లంఘిస్తూ, పెట్టుబడిదారులకు అనుకూల విధానాలు అమలు చేస్తోందని విమర్శించారు. ప్రభుత్వరంగ సంస్థలను ప్రయివేటు, పెట్టుబడిదారుల చేతికి అప్పగించే ప్రయత్నం జరుగుతోందని అన్నారు. ఎల్ఐసీ వంటి సంస్థలను అదానీ, అంబానీలకు లబ్ది చేకూరేలా వాటిని నిర్వీర్యం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫిక్స్‌డ్ టర్మ్, ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు నియామకాల ద్వారా శాశ్వత ఉద్యోగాలను తొలగించడం ద్వారా కార్మికులను భద్రత లేని పరిస్థితుల్లోకి నెట్టివేయడం జరుగుతోందన్నారు. జులై 9న దేశవ్యాప్తంగా సిఐటియు ఆధ్వర్యంలో అన్ని కార్మిక సంఘాలతో కలిసి జరిగిన కార్మికుల దేశవ్యాప్త సమ్మెకు విస్తృతమైన మద్దతు లభించిందని గుర్తుచేశారు. ఇటీవల కేంద్రం ప్రకటించిన శ్రామిక శక్తి నీతి 2025 లేబర్ కోడ్లను వేగంగా అమలు చేసేందుకు కేంద్రం కుట్రలు చేస్తోందన్నారు. ఈ విధానం ద్వారా దేశవ్యాప్తంగా 8 నుంచి 10 గంటల పని విధానం కొనసాగించేందుకు ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో కూడా ఇదే విధానం కొనసాగించడం దురదృష్టకరమన్నారు. కేవలం ఎర్రజెండా నీడలో ఉన్న వామపక్ష ప్రభుత్వం కేరళలో మాత్రమే 8 గంటల పని విధానం కొనసాగుతోందని తెలిపారు. రాష్ట్రంలో ఆరు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను ఇంకా నెరవేర్చలేదని విమర్శించారు. భద్రతా లోపాల వల్ల సిగాచి పరిశ్రమలో 48 మంది కార్మికులు మృతిచెందినా, ప్రకటించిన నష్టపరిహారం ఇప్పటివరకు ఇవ్వకపోవడం దారుణమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని, కార్మికులకు గౌరవప్రదమైన జీవనావకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు.



డిమాండ్లు నెరవేర్చకుంటే రాష్ట్రవ్యాప్త బంద్

- ఫెడరేషన్ ఆఫ్ అసోసియేషన్స్ ఆఫ్ తెలంగాణ హయ్యర్ ఇనిస్టిట్యూషన్స్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నవంబర్ 1లోపు తమ డిమాండ్లు నెరవేర్చకుంటే 3 నుంచి రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రయివేటు ఉన్నత విద్యా సంస్థల బంద్ పాటిస్తామని ఫెడరేషన్ ఆఫ్ అసోసియేషన్స్ ఆఫ్ తెలంగాణ హయ్యర్ ఇనిస్టిట్యూషన్స్ హెచ్చరించింది. ఆదివారం అత్యవసరంగా ఫెడరేషన్ జనరల్ బాడీ మీటింగ్ ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ఫీజు రీఇంబర్స్‌మెంట్‌ను దీర్ఘకాలంగా విడుదల చేయకపోవడంతో ప్రయివేటు కాలేజీలు ఎదుర్కొంటున్న ఆర్థిక ఇబ్బందుల పరిస్థితులను సమీక్షించారు. అనంతరం నాలుగు డిమాండ్లను ప్రభుత్వం ముందు పెడుతూ ఏకగ్రీవంగా తీర్మానించినట్టు ఫెడరేషన్ చైర్మెన్ డాక్టర్ ఎన్.రమేశ్ బాబు, సెక్రెటరీ జనరల్ కె.ఎస్.రవికుమార్, కోశాధికారి కె.కష్ణారావు, ఆర్గనైజింగ్ సెక్రెటరీ డాక్టర్ కె.సునీల్ కుమార్ ఒక ప్రకటన విడుదల చేశారు.

దసరా, దీపావళిలోపు విడుదల చేస్తామని హామీ ఇచ్చి బకాయిపడ్డ రూ.900 కోట్లను నవంబర్ 1లోపు విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు. 2024-25 వరకకు పెండింగ్ ఉన్న డ్యూస్ అన్నింటినీ 2026 మార్చి 31 నాటికి క్లియర్ చేసేలా టైంబాండ్ రోడ్ మ్యాప్‌ను ప్రకటించాలని కోరారు. ఈ డ్యూస్ దాదాపు రూ.9,000 కోట్లు ఉన్నట్టు తెలిపారు. అదే విధంగా 2025-26 విద్యా సంవత్సరం బకాయిలను కూడా 2026 జూన్ 30 నాటికి పూర్తిగా చెల్లించేలా రోడ్‌మ్యాప్ విడుదల చేయాలని కోరారు. ఏఐసీటీఈ ఆమోదించిన కొత్త కోర్సులకు సంబంధించిన ఎన్ఓసీలు పలు నెలలుగా పెండింగ్‌లో ఉన్నాయని వారు గుర్తుచేశారు. కనీసం వచ్చే విద్యా సంవత్సరం నుంచైనా ఈ కోర్సులకు దరఖాస్తు చేసుకునేందుకు వీలుగా స్పష్టమైన మార్గదర్శకాలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. తమ నాలుగు డిమాండ్లు, రోడ్ మ్యాప్‌లతో నవంబర్ 1లోపు నెరవేర్చకుంటే 3 నుంచి బంద్ తప్పదని హెచ్చరించారు. ఫెడరేషన్ చైర్మన్ డాక్టర్ ఎన్.రమేశ్ బాబు మాట్లాడుతూ నవంబర్ 10లోపు 2 లక్షల మందితో సమావేశం ఏర్పాటు చేస్తామని తెలిపారు. తర్వాత 10 లక్షల మంది విద్యార్థులతో భారీ సభ ఏర్పాటు చేస్తామని చెప్పారు. ప్రభుత్వ వైఖరికి అనుగుణంగా తమ నిరసన కార్యక్రమాలు వెల్లడించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ అడిగినప్పుడే ప్రభుత్వ ఎంక్వైరీలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పెండింగ్ బకాయిల విషయంలో మంత్రులు తమకు సహకరించడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. ఏ ఒక్క పోలీసును కూడా కాలేజీలోకి అనుమతించబోమని స్పష్టం చేశారు.

పుట్ట మధు కుట్రలపై విచారణ జరపాలి

- టిపిసిసి అధికార ప్రతినిధి డాక్టర్ లింగం యాదవ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



ఐటి శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుపై మాజీ ఎమ్మెల్యే పుట్టమధు చేస్తున్న కుట్రలపై విచారణ జరిపించాలని టిపిసిసి అధికార ప్రతినిధి డాక్టర్ లింగం యాదవ్ డిమాండ్ చేశారు. మంత్రి ఇమేజ్ డ్యామేజ్ చేయాలని ప్రయత్నించొద్దని హెచ్చరించారు. ఆదివారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. పుట్టమధుకు సెటిల్‌మెంట్లు, హత్యలే తప్పా ఆయనకేం తెలుసన్నారు. మంత్రి పేషీ నుంచి తప్పు జరిగినట్టు నిరూపించాలని సవాల్ విసిరారు. శ్రీధర్‌బాబు ఎలాంటి వ్యక్తో, ఆయన వ్యక్తత్వమేంటో కేసీఆర్, కెటిఆర్‌ను అడిగి తెలుసుకోవాలని సూచించారు. సిబిఐ కేసు నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకు మంత్రిపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. అబద్ధాలు ప్రచారం చేసి ఇదే నిజమనుకుంటే పొరపాటన్నారు. హైదరాబాద్‌ను గ్లోబల్ క్యాపిటల్‌గా మార్చేందుకు శ్రీధర్‌బాబు కారణమనీ, అలాంటి మంత్రిపై ఆరోపణలు చేయడం మానుకోవాలని ఆయన హెచ్చరించారు.

జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక.. హీటెక్కిన ప్రచారం..!

- ఇంటింటికి ప్రచారంలో కాంగ్రెస్
- సిట్టింగ్ స్థానాన్ని నిలుపుకునేందుకు బిఆర్ఎస్ ప్రయత్నాలు
- ఎలాగైనా పాగా వేయాలని బిజెపి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నికల ప్రచారం తారాస్థాయికి చేరింది. ప్రధాన రాజకీయ పక్షాలైన కాంగ్రెస్, బిఆర్ఎస్, బిజెపి.. ఈ ఎన్నికను ప్రతిష్టాత్మకంగా తీసుకుని, ముమ్మర ప్రచారంలో నిమగ్నమయ్యాయి. అగ్రనేతలు రంగంలోకి దిగి మాటల తూటాలు పేల్చుతుండటంతో రాజకీయ వాతావరణం వేడెక్కింది. గడప గడపకూ తిరుగుతూ ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు అభ్యర్థులు, నేతలు సర్వశక్తులు ఒడ్డుతున్నారు. కాగా బిఆర్ఎస్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ సతీమణి మాగంటి సునీత ఆ పార్టీ తరపున, వి.నవీన్ యాదవ్ కాంగ్రెస్ అభ్యర్థిగా, లంకల దీపక్ రెడ్డి బిజెపి నుంచి బరిలో ఉన్నారు. ఈ ఉప ఎన్నిక నవంబర్ 11న జరగనుంది.

మూడు పార్టీల మధ్య మాటల యుద్ధం

ప్రధాన పార్టీల మధ్య మాటల యుద్ధం తీవ్రస్థాయికి చేరింది. బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్.. కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పిస్తున్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైందని, ప్రజలను మోసం చేసిందని ఆరోపిస్తున్నారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో కాంగ్రెస్‌ను ఓడించడం ద్వారానే ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చి, ఇచ్చిన హామీలను అమలు చేసేలా చేయవచ్చని ప్రజలకు చెబుతున్నారు. మరోవైపు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, బిజెపి మధ్య రహస్య ఒప్పందం ఉందని ఆరోపించారు. ఈ రెండు పార్టీల కుట్ర రాజకీయాలను ప్రజలు తిప్పికొట్టాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలే తమను గెలిపిస్తాయని ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఈ ఎన్నిక రౌడీలకు, మహిళలకు మధ్య జరుగుతున్న పోరాటమని.. ఇందులో మహిళనే గెలవాలని బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ మాటాలతో ప్రచారాన్ని మరింత హీటెక్కించారు. బీజేపీ అగ్రనేత, కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు దశాబ్దాలుగా జూబ్లీహిల్స్‌ను నిర్లక్ష్యం చేశాయని విమర్శిస్తున్నారు. ఈ నియోజకవర్గాన్ని 'సమస్యల హిల్స్'గా మార్చారని ఆరోపించారు. కాంగ్రెస్, ఎంఐఎం పార్టీల మధ్య అవగాహన ఉందని, కాంగ్రెస్‌కు ఓటు వేస్తే అది ఎంఐఎంకు వేసినట్టేనని చెబుతున్నారు.


జూబ్లిహిల్స్ ఉప ఎన్నికకు ప్రచారం చేస్తున్న మంత్రి పొన్నం

రంగంలోకి అగ్రనేతలు

మూడు ప్రధాన పార్టీలు తమ అగ్రనేతలను ప్రచార బరిలోకి దింపాయి. బిఆర్ఎస్ అధినేత మాజీ ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావు సహా 40 మంది స్టార్ క్యాంపెయినర్ల జాబితాను ఆ పార్టీ విడుదల చేయగా.. కేటీఆర్, హరీశ్ రావు వంటి నేతలు ఇప్పటికే డివిజన్ల వారీగా ప్రచార బాధ్యతలను పర్యవేక్షిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ కూడా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో 40 మంది స్టార్ క్యాంపెయినర్లను ప్రకటించగా.. మంత్రులు, సీనియర్ నేతలు డివిజన్ల వారీగా ప్రచార బాధ్యతలు చేపట్టారు. పొన్నం ప్రభాకర్, ఇతర నేతలు ఇప్పటికే డివిజన్ల వారీగా ఇంటింటికి ప్రచారం నిర్వహిస్తూ.. ఓటర్లకు ప్రజాపాలన ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి.. అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ.. ఓట్లు అడుగుతున్నారు. ఇక ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈనెల 28 నుంచి రోడ్ షోలు, బహిరంగ సభల్లో పాల్గొననున్నారు. బిజెపి తరపున కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ప్రచార బాధ్యతలను ముందుండి నడిపిస్తున్నారు. ఆయనతో పాటు పలువురు రాష్ట్రస్థాయి నేతలు కూడా ప్రచారంలో పాల్గొంటున్నారు.

గడప గడపకూ ప్రచారం

అభ్యర్థులు, పార్టీల నేతలు ఇంటింటి ప్రచారాన్ని ముమ్మరం చేశారు. కాంగ్రెస్ మంత్రులు, నేతలు డివిజన్ల వారీగా గడప గడపకూ తిరుగుతూ ప్రభుత్వ పథకాలను వివరిస్తున్నారు. బిఆర్ఎస్ నేతలు కూడా ఇంటింటికి వెళ్లి, కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ, తమ అభ్యర్థిని గెలిపించాలని కోరుతున్నారు. బిజెపి నేతలు సైతం, ముఖ్యంగా కేంద్రమంత్రి కిషన్ రెడ్డి, బస్తీలలో పర్యటిస్తూ, స్థానిక సమస్యలను ప్రస్తావిస్తూ ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఈ ఉపఎన్నిక ఫలితం రానున్న గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జిహెచ్ఎంసి) ఎన్నికలపై ప్రభావం చూపే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. అందువల్ల మూడు పార్టీలు ఈ ఎన్నికను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుని, విజయం కోసం సర్వశక్తులు ఒడ్డుతున్నాయి.